సాక్షి మెదక్



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

అర్బన్ పార్కు సందర్శించిన రాష్ట్ర అధికారి



అర్బన్‌పార్కులో వాచ్‌టవర్‌పై నుంచి అడవిని వీక్షిస్తున్న జాన్‌వెస్లీ

నర్సాపూర్: అటవీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్థానిక అర్బన్‌పార్కును రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీకి స్థానిక ఎంపీఓ శ్రీనివాస్ పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన కుటుంబ సభ్యులతో అర్బన్‌పార్కులో పర్యటించి వాచ్ టవర్‌పై నుంచి పచ్చని అడవీ అందాలను వీక్షించారు. అర్బన్ పార్కు బాగుందని జాన్‌వెస్లీ కితాబిచ్చారు.

డీఏ ను విడుదల చేయాలి

ఎమ్మెల్సీ కొమురయ్యకు తపస్ నాయకుల విజ్ఞప్తి



కొమురయ్యతో తపస్ సంఘం నేతలు

చేగుంట(తూప్రాన్): 2008 కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు, పెండింగ్ డీఏ, 317 బాధితుల సమస్యలను వివరించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తపస్ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు లక్ష్మణ్ తదితరులు కొమురయ్యను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో తపస్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవాతు సురేశ్, కార్యదర్శి నవీన్, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎల్లం, జిల్లా బాధ్యులు శేఖర్, మల్లేశం, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు తదితరులు ఉన్నారు.

ట్రయల్‌రన్ నిర్వహించిన అధికారులు



రైల్వేట్రాక్‌పై నిర్వహిస్తున్న ట్రయల్‌రన్

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామ శివారులో తెగిపోయి రైల్వేబ్రిడ్జిను సరి చేసిన అధికారులు రైల్వే ఇంజన్‌తో బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. బుధవారం రాత్రి సికింద్రాబాద్ మీదుగా మెదక్‌కు రైలు రానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రాత్రి 11గంటలకు మెదక్ చేరుకోనున్న ఈ రైలు గురువారం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనుంది.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



పెద్దశంకరంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న నర్సింహులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) శతాబ్ది ఉత్సవాలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీటీడీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మెదక్ విభాగ్ సహ కార్యావాహ బి.నర్సింలు మాట్లాడుతూ.. హిందువులందరూ సంఘటితంగా ఉండాలని, దేశ సమగ్రతను కాపాడటంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. వందేళ్ల ఈ ఉత్సవాలను తరతరాలకు గుర్తిండిపోయేలా విజయవంతం చేయాలని, పంచ పరివర్తనలో భాగంగా కుటుంబ ప్రబోధన్ సామాజిక సమరసత, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, పౌరవిధులు తదితర అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో జైహింద్ రెడ్డి, సీతారాం, సతీశ్‌గౌడ్, రవివర్మ, క్రాంతీలాల్, సర్వేశ్వర్, వీరప్ప,శ్రావణ్, శివశంకర్, విఠల్, నందు, దత్తు తదితరులున్నారు.

40 ఏళ్లుగా త్రివర్ణం రెపరెపలు

జాతీయ జెండా ఎగురవేసిన తర్వాతే పండుగ సంబరాలు

మిరుదొడ్డి(దుబ్బాక): ఇక్కడ 40 ఏళ్లుగా త్రివర్ణ పతాకం నిరంతరం రెపరెపలాడుతూనే ఉంటోంది. దసరా పండుగ వచ్చిందంటే చాలు ఆ గ్రామంలో దేశభక్తి భావం ఉప్పొంగుతుంది. దసరా పండుగ రోజున జాతీయ జెండాను ఎగురవేసిన తర్వాతే పాల పిట్ట దర్శనానికి వెళ్లడం ఇక్కడ ఆనవాయితీ. దీంతో వచ్చే దసరా పండుగ రోజు వరకు జాతీయ జెండా ఎగురుతూనే ఉండటం విశేషం. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. గ్రామ నడిబొడ్డున ఉన్న బురుజుపై 40 ఏళ్ల క్రితం గ్రామ పెద్దల తీర్మానం ప్రకారం ప్రతి దసరా పండుగ రోజున జాతీయ జెండాను ఎగురవేసి దసరా పండుగను జరుపుకోవాలని నిర్ణయించారు. ఇలా ప్రతి దసరా పండుగ రోజున జాతీయ జెండాను ఎగురవేస్తారు. గ్రామ సర్పంచ్ లేదా గ్రామ పంచాయతీ కార్యదర్శి జెండాను ఎగురవేసి జనగణమన గీతాలాపనతో తమ దేశ భక్తిని చాటుకుంటారు. ఇలా ఎగురవేసిన జాతీయ జెండా గ్రామంలో యేడాది పాటు నిరంతరం ఎగురుతూనే ఉంటుంది. మళ్లీ దసరా రోజునే జాతీయ జెండాను ఎగురవేసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు. ఈ సారి గాంధీ జయంతి, దసరా పండుగ ఒకే రోజు రావడంతో గ్రామంలో ప్రత్యేకతను చాటుకోనుంది.



అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో రెపరెపలాడుతున్న జాతీయ జెండా

ఊరంతా ఏకమై.. సంప్రదాయం వేడుకై

బతుకమ్మ, దాండియా ఆటలతో దుమ్మురేపే ఆడపడుచులు


యువకుల అలయ్- బలయ్ దుబ్బాకలో ప్రత్యేకం

దుబ్బాక/దుబ్బాకటౌన్: పట్టణంలో దసరా ఉత్సవాలు ప్రతీ ఏటా ప్రత్యేకంగా నిలుస్తాయి. దాదాపు ఇరవై ఏళ్ల నుంచి ఈ వేడుకలు జరుగుతున్నాయి. పండుగ రోజు సాయంత్రం ఊరి ప్రజలంతా గాంధీ విగ్రహం వద్ద ఏకమై రావణ దహనం చేస్తారు. అనంతరం ఆడపడుచుల బతుకమ్మ, దాండియా ఆటలతో అలరిస్తారు. యువకులు, పెద్దలు అలయ్ - బలయ్ కార్యాక్రమాలు, యువకుల డ్యాన్సులు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పట్టణాలను నుంచి వచ్చిన ఉద్యోగస్తులు, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు చిన్ననాటి స్నేహితులను కలుసుకుని మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తుకుంటారు. దసరా రోజే కాకుండా దేవి శరన్నావరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండల పాల వద్ద వారం పాటు ఆడపడుచుల దాండియా, బతుకమ్మ ఆటపాటలు కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి. అలాగే దసరారోజున పట్టణంలోని చెల్లాపూర్‌రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జమ్మిచెట్టు వద్దకు డప్పుచప్పుళ్లతో వెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ.



దుబ్బాక పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మహిళల దాండియా, బతుకమ్మల ఆటలు


గడీల దేవాలయంలో వందల ఏళ్లుగా..



ఇస్మాయిల్ ఖాన్ పేటలో గడీలతో ఉన్న దేవాలయం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేటలోని గడీలతో ఉన్న దేవాలయంలో దసరా వేడుకలు సంబురంగా జరుగుతాయి. ఊరంతా దేవాలయానికి వచ్చి రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం కొన్ని ఏళ్ల నుంచి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. జమ్మి పూజ చేసి గ్రామస్తులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

సంగీత విభావరి వినూత్నం



దహనానికి భారీ రావణాసురుడి కటౌట్

నారాయణఖేడ్: దసరా పండుగ పర్వదినాన్ని నారాయణఖేడ్ పట్టణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. పట్టణంలోని తహసీల్ గ్రౌండ్‌లో ప్రతీ ఏడాది రావణదహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఎంపీ సురేష్ షెట్కార్ కుటుంబం తరపున ఈ రావణదహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ఈ సారి కూడా అలాగే రావణ దహనం కార్యక్రమాలకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు సంగీత విభావరిని సైతం ఏర్పాటు చేస్తారు. పట్టణంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తిలకించేందకు భారీ సంఖ్యలో తరలివస్తారు.

మనసారా.. దసరా



నేడు విజయదశమి

ఉమ్మడి జిల్లాలో వైవిధ్యభరితం

ఉమ్మడి మెదక్ జిల్లా విభిన్న జీవన సంస్కృతుల సమ్మేళనం. అనేక ఆచారాలు, అలవాట్లతో కూడిన వైవిధ్యమైన ఉమ్మడి జిల్లా. వివిధ వర్గాల ప్రజలు దసరా ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా అంటే సరదాలకు, సందళ్లకు మరొక పదం. ఆట పాటలకు ఆలవాలం. ఇంటిల్లిపాదీ నూతన దుస్తులు ధరించి రకరకాల పిండి వంటలు, నాన్‌వెజ్ వంటకాలతో ఆనందంగా గడిపేస్తారు. అంతా కలిసి బ్యాండు మేళాలతో వెళ్లి పాల పిట్టను చూసి విజయోత్సాహంతో కేరింతలు కొడతారు. అక్కడి నుంచి నేరుగా జమ్మి చెట్టు దగ్గరకు వెళ్లి పూజలు చేస్తారు. పాపాలన్నీ తొలగిపోవాలని కోరుకుంటారు. మనుషుల మధ్య కల్మషాలన్నింటినీ కడిగి పారేసి ప్రేమ, ఆత్మీయత, అనురాగాలను పంచిపెట్టే పండుగ దసరా. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వైవిధ్యభరితంగా జరిగే వేడుకల కథనాలు కొన్ని..



సంగారెడ్డిలో సందడే..

సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో ఉత్సవాల ఏర్పాట్లు..



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కేంద్రం దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. పండగను పురస్కరించుకుని పాతబస్టాండ్ రాంమందిర్ నుంచి శావ శోభాయత్ర నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో భజన కీర్తలతో ఈ శోభయాత్ర ఉంటుంది. రాంమందిర్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఈ శోభాయాత్ర జరుగుతుంది. అంబేద్కర్ స్టేడియంలో రావణ దహణ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తారు. భారీ స్థాయిలో బాణాసంచ కాల్చుతారు. పట్టణ వాసులతో పాటు, పరిసర గ్రామాల ప్రజలు ఈ వేడుకలకు హాజరవుతుంటారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడి దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ప్రతి ఏటా ఈ వేడుకలను తన సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఏటా ఈ వేడుకలను స్వయంగా పర్యవేక్షిస్తారు. వేడుకల్లో భాగంగా ప్రముఖ సినీ నేపథ్య గాయకుల బృందాలు పాడే భక్తిగీతాలు వేడుకకు హాజరైన వారిలో ఆధ్మాత్మిక భావాన్ని పెంపొందిస్తుంటాయి.

32 అడుగుల రావణుడి భారీ కటౌట్

నేడు హుస్నాబాద్‌లో రామ్‌లీలా ● ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాట్లు

హుస్నాబాద్: దసరా అంటేనే గుర్తుకు వచ్చేది రామ్‌లీలా.. పట్టణంలో పలు స్వచ్ఛంధ సంస్థలు రామ్‌లీలా కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈసారి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాట్లు జరుగుతున్నాయి. వరంగల్‌కు చెందిన రాజ్‌కుమార్ బృంద సభ్యులు 32 అడుగుల రావణుడి భారీ కటౌట్ ఏర్పాటు చేస్తున్నారు. కట్ట కింది నుంచి జనం వీక్షించేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నారు. ఫ్లడ్ లైట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు నడుమ రావణ వధ ప్రజలకు కనువిందు చేయనుంది.



రావణుడి కటౌట్ (ఫైల్)

'జమ్మి'వనం..

ప్రత్యేకత చాటుకుంటున్న తున్కిఖాల్సా పల్లెప్రకృతి వనం

వర్గల్(గజ్వేల్): అడవిలో 'జమ్మి' వనం ఊరందరికి చేరువైంది. పల్లె ప్రకృతికి శోభనిస్తోంది. పూజనీయమైన జమ్మి వృక్షాలతో వర్గల్ మండలం తునిఖాల్సా పల్లె ప్రకృతి వనం ప్రత్యేకత చాటుకుంటున్నది. గ్రామానికి అర కిలో మీటరు దూరంలో 5 జమ్మి వృక్షాలు ఒకేచోట సముదాయంగా పెరిగాయి. అక్కడే దసరా జమ్మీ పూజ నిర్వహించుకునేవారు. 2019లో పల్లెప్రకృతివనం ఆలోచన తెరపైకి వచ్చింది. ఆ వెంటనే రెండెకరాల విస్తీర్ణంలో జమ్మిచెట్లు మధ్యలో ఉండేలా పచ్చనిలాన్, చుట్టూరా వృత్తాకారంలో గద్దె, అక్కడే భారతమాత విగ్రహం, దేశభక్తికి చిహ్నంగా ఎత్తయిన జాతీయ జెండా, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు, తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా బతుకమ్మ..ఇలా అన్ని కలగలసి పల్లెప్రకృతి వనం శోభాయమానంగా రూపుదిద్దుకున్నది. ఆహ్లాదతకు నెలవుగా, ఊరందరూ దసరా వేళ జమ్మి వృక్షాలు పూజించే ఆధ్యాత్మికతల కొలువుగా ప్రత్యేకత చాటుకుంటున్నది.



జమ్మివృక్షాల సముదాయంతో తున్కిఖాల్సా పల్లెప్రకృతి వనం

అందరిచూపు కోర్టు తీర్పుపైనే

- 42% బీసీ రిజర్వేషన్లపై 8న తీర్పు వెలువరించనున్న కోర్టు
- ఎన్నికలు జరుగుతాయా లేదా అనే దానిపై నెలకొన్న సందిగ్ధత
- తీర్పు వచ్చాకే ఎన్నికల క్షేత్రంలోకి దూకాలనుకుంటున్న నేతలు
- స్థానిక ఎన్నికల తీరిది

మెదక్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆశావహులంతా అక్టోబర్ 8న కోర్టు వెలువరించే తీర్పు కోసం ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. 42% బీసి రిజర్వేషన్లు అమలు అవుతాయా? అసలు ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనే గందరగోళంలో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ నెల 9న ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఖర్చులు పెట్టుకోవడానికి వెనుకా ముందు ఆలోచిస్తున్నారు. ఈ నెల 5 వరకు జెడ్పీటీసీ ప్రాదేశిక నియోజక వర్గానికి ముగ్గురు ఆశావహుల చొప్పున పేర్లు పంపాలని పీసీసీ ఆదేశించడంతో, కాంగ్రెస్‌లో కొంత కదలిక మొదలైంది. అలాగే బీఆర్‌ఎస్ నాయకులు కూడా బుధవారం ఏడుపాయల్లో కలుసుకున్నారు. కాగా అధికారులు మాత్రం ఎన్నికల నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



ఎవరి ధీమా వారిదే

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు అమలవుతాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ధీమాగా ఉండగా అదే పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకుల్లో మాత్రం అనుమానాలు లేవనెత్తుతున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా రాని వారు కూడా స్థానిక ఎన్నికలపై ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా పార్టీలో ముఖ్యులుగా చలామణి అవుతున్న ఓసీ వర్గాలు రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నిర్లిప్తంగా కనిపిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రిజర్వేషన్ల అమలుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్‌కు అనుగుణంగా కొంత మేర సంసిద్ధత ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ, ఈ నెల 8 న కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని వేచి చూస్తున్నారు. చాలామంది ఆశావహులు ఈ నెల 8 తర్వాతే ,ఆర్థిక పరమైన ఖర్చులు చేయాలని భావిస్తున్నారు. పండుగల సమయంలో కూడా వృథా ఖర్చులు చేయడం లేదు. సందిగ్ధత నడుమ ఎన్నికలకు సంసిద్ధులవుతున్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలవుతాయా!

మెదక్ జిల్లాలో 21 జెడ్పీటీసీలు,190 ఎంపీటీసీలు, 492 గ్రామపంచాయతీలు,5,23,327 ఓటర్లు ఉన్నారు. స్థానిక ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేసే ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వం జీవో నంబర్ 09 విడుదల చేసింది. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలు 3 దశల్లో, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. అయితే బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ సెప్టెంబర్ 27న కొంతమంది హైకోర్టుకు వెళ్లారు. ఈ విషయంలో ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు, 42% రిజర్వేషన్లు కల్పించడంపై ప్రభుత్వానికి,ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది.

గెలుపు గుర్రాల వేటలో పార్టీలు

- ఒక్కో జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురిని గుర్తిస్తున్న కాంగ్రెస్
- ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో నిమగ్నమైన బీఆర్‌ఎస్, బీజేపీ

మెదక్‌జోన్/పాపన్నపేట (మెదక్): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా ఆయా పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఒక్కోజెడ్పీ స్థానానికి ముగ్గురు అభ్యర్థుల చొప్పున గుర్తించి జాబితాను పంపాలని కాంగ్రెస్‌పార్టీ సూచించగా ఆ దిశగా అభ్యర్థులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇక ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల జాబితాను ఇవ్వాలని ముఖ్యకార్యకర్తలకు సూచించింది.

ఈ నెల 5 నాటికి పీసీసీకి జాబితా

కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను హస్తగతం చేసుకోవాలని భావించి ఒక్కో జెడ్పీటీసీ స్థానానికి ముగ్గురు అభ్యర్థులను గుర్తించి ఈనెల 5వరకు వారి జాబితాను పీసీసీకి పంపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించటంతో ఆ పార్టీ నేతలు ఆగమేఘాల మీద గెలుపుగుర్రాల కోసం జల్లెడపడుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలే అస్త్రంగా బీఆర్‌ఎస్

రెండేళ్లల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని దీనినే అస్త్రంగా చేసుకుని స్థానిక ఎన్నికల బరిలో దిగాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు దేవేందర్‌రెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోగల ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇదే విషయాన్ని వెల్లడించారు. పోటీ చేయాలనుకునే వారి జాబితాను ఇవ్వాలని వారికి సూచించారు.



జీఎస్టీ తగ్గింపుతో బీజేపీ

ప్రధాని మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, జీఎస్టీ తగ్గింపుతో దేశ ప్రజలకు కలిగే లాభాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థలల్లో భారీగా లబ్ధి పొందాలని బీజేపీ యోచిస్తోంది. పాపన్నపేట మండలంలో బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశంగౌడ్ నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇదే విషయాన్ని పార్టీ శ్రేణులకు వివరించారు. యువతను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పేర్లను ఖరారు చేసే పనిలో బీజేపీ నిమగ్నమైంది.

మంజీరా వరదలతో అప్రమత్తం

ఎల్లాపూర్ బ్రిడ్జిని తాకుతూ ప్రవహిస్తున్న మంజీరా

పాపన్నపేట(మెదక్): పోటెత్తుతున్న మంజీరా వరదలతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. ఏడుపాయల ఆలయం ముందు బుధవారం ఆయన మంజీర వరదను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఘనపురం ఆనకట్టపై నుంచి 1.09 లక్షల నీరు వెళ్తుందన్నారు. వరదలు ఉధృతంగా ఉండటంతో ఎల్లాపూర్ బ్రిడ్జిని తాకుతూ నీరు ప్రవహిస్తోందన్నారు. ప్రవాహం పెరిగితే రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా నది వైపు ఎవరు వెళ్లొద్దని చెప్పారు.




ఏడుపాయల్లో వరద ఉధృతిని పరిశీలిస్తున్న డీఎస్పీ

సుందర జల దృశ్యం

మండల కేంద్రమైన కౌడిపల్లి పెద్దచెరువులో బుధవారం సాయంత్రం సూర్యాస్తమ సమయంలో బంగారువర్ణంలో సూర్యకాంతికి చెరువు నీరు ఇలా ద్విగుణీకృతమై సుందరదృశ్యం ఆవిష్కృతమైంది.

– కౌడిపల్లి(నర్సాపూర్):



కౌడిపల్లి చెరువు వద్ద సుందర దృశ్యం

క్లుప్తంగా

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

కొమురవెల్లి(సిద్దిపేట): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం ఆయన స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య నాహక్కు, బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దాం అనే నినాదంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. గత ప్రభుతం మూసేసిన 6వేల పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్నారు. ఆయన వెంట రాజు, అమరేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు..



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

గజ్వేల్‌రూరల్: తప్పిపోయిన బాలుడిని గుర్తించి పోలీసులు తండ్రికి అప్పగించారు. ఈ ఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ వివరాల ప్రకారం... తూప్రాన్‌కు చెందిన పానాటి చరణ్(8) గజ్వేల్ బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతుండటం గమనించిన పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. బాలుడికి సంబంధించిన వివరాలు తెలుసుకొని అతని తండ్రి పానాటి సత్తికి సమాచారం అందించారు. అనంతరం తండ్రికి బాలుడిని అప్పగించడంతో పాటు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని గోవిందరాజ్ పల్లి బస్టాండ్ సమీపంలోని కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం... కుంటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంను స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో బయటకు తీశారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 ఏళ్లు ఉంటాయి. వైట్ హౌస్ బ్రాండ్ పాయింట్ కాకి కలరుతోపాటు తెలుపు బనీను ధరించాడు.

పసల్వాది గ్రామ శివారులో...

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని పసల్వాది గ్రామ శివారులో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ వివరాల ప్రకారం... గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం ఉందని స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. శవాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

టాస్కులు, కమీషన్ పేరుతో సైబర్ మోసం

రూ.47 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరగాళ్ల మెసేజ్‌కు స్పందించి ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్నాడు. క్రైమ్ సీఐ రాజు వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 15న తన ఫోన్‌కు టాస్కులు చేస్తే కమీషన్ ఇస్తామని గుర్తుతెలియని మహిళ నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఈ క్రమంలో ఉద్యోగి నగదు చెల్లించి టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా అతడు పెట్టిన నగదును సైబర్ నేరగాళ్ల వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. బాధితుడు మొత్తం రూ.47 లక్షల 67 వేలు చెల్లించాడు. ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సైబర్, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడు ఆత్మహత్య



నరేశ్

జోగిపేట(అందోల్): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి పట్టణంలోని మల్లన్న కాలనీకి చెందిన కమ్మరి నరేశ్ (20)కు 2021లో వివాహం జరిగింది. కొన్ని రోజులకు భార్యకు విడాకులు ఇచ్చాడు. పట్టణంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఉరి వేసుకున్నాడు.



కొలువుదీరిన భవానీమాత





శివాజీ నిర్మించిన భవానీమాత ఆలయం, ఆలయం ఎదుట నిర్మించిన శివాజీ మహారాజ్ మందిరం

భవానమ్మ పల్లెలో నవరాత్రి ఉత్సవాలు

శివాజీ మహారాజ్ నిర్మించిన 'తుల్జా భవానీ' ఆలయం

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని ఖాంజమాల్‌పూర్ (భవానమ్మపల్లె)లో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ స్వయంగా తుల్జా భవానీమాత ఆలయాన్ని నిర్మించారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ ఆలయం ఎంతో పురాతనమైనది. 400 సంవత్సరాల క్రితం శివాజీ మహారాజ్ ఆలయాన్ని నిర్మించారని పురాణ గాథలున్నాయి. ఆయన యుద్ధానికి వెళ్లే ముందు జహీరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ గ్రామంలో సేద తీరారని, విజేతనై వస్తే భవానీమాతకు ఈ ప్రాంతంలో ఆలయం కట్టిస్తానని మొక్కుకున్నట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. విజయం సాధించాక ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. భవానీమాత ఆలయం ఎదుట శివాజీ మహారాజ్ ఆలయం సైతం ఉంది. తుల్జా భవానీ మాత ఆలయంలో ప్రతి పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుంటారు. ఒక రోజు ముందుగానే ఆలయానికి చేరుకుంటారు. భక్తులకు అన్నదానం కూడా చేస్తారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

విజయాలు సాధించాలి

అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు(సిద్దిపేట): చేసే ప్రతి పనిలో పోలీసులు విజయం సాధించాలని అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సాయుధ దళాల కార్యాలయంలో దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన జంబి చెట్టుకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు ధరణి కుమార్, పూర్ణ చందర్, విష్ణు ప్రసాద్, కార్తీక్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



జంబి పూజ చేస్తున్న అదనపు డీసీపీ

పత్తికి గులాబీ గుబులు

- ముందస్తు జాగ్రత్తలతో పురుగుకు చెక్
- సస్యరక్షణ చర్యలతో పంటను కాపాడుకోవాలి
- శాస్త్రవేత్త ఎన్.స్నేహలత సూచనలు



ఎన్.స్నేహలత, శాస్త్రవేత్త

జహీరాబాద్: భారీ వర్షాల కారణంగా ఇప్పటికే పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఉన్న వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీడీఎస్-కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఎన్.స్నేహలత తెలిపారు. ముఖ్యంగా గులాబీ పురుగు బారి నుంచి పత్తిని కాపాడుకోవాలని సూచించారు. ఈ సమయంలో గులాబీ పురుగు, రసం పీల్చే పురుగు, కాయకుళ్లు తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కాయ గట్టిపడి ఎదిగే దశలో ఉందని, రైతులు పురుగు ఉనికిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపడితే పత్తిలో దిగుబడులు సాధించవచ్చని ఆమె పలు సూచనలు చేశారు.

నష్టపరిచే లక్షణాలు

గులాబీ పురుగు బారిన పడిన పంట పూత దశలో ఉన్నప్పుడు దాంట్లో విచ్చుకోకుండా ఉన్న పువ్వులను విప్పి చూస్తే పిల్ల పురుగు గమనించవచ్చు. వీటినే గుడ్డి పువ్వులు అంటారు. పత్తి కాయలు పగలాల్సిన సమయం కంటే ముందుగానే పగిలి ఎండిపోతాయి.

యాజమాన్య పద్ధతులు


ముందుగా ఈ పురుగు కోశస్థ దశలు కోసి విడిచిపెట్టిన పంట లేదా భూమిలో అలాగే ఉంటాయి. పంటను వేయడానికి ముందు ఏప్రిల్, మేలో దుక్కలను లోతుగా దున్నడం వల్ల అవి సూర్యరశ్మికి ఆకర్షితం అవడం, పక్షులు తినడం వల్ల కొంత వరకు పంటను కాపాడుకోవచ్చు. పంటను వేసుకునే సమయంలో అంతర పంటగా ప్రతి ఏడు సాళ్లకు మధ్య ఒక కంది సాలు వేసుకోవాలి. 45 రోజుల తర్వాత లింగాకర్షక బుట్టలు 4 నుంచి 8 అమర్చుకున్నట్లయితే పురుగు ఉధృతిని గమనించవచ్చు. పూత సమయంలో గుడ్డి పువ్వులు, వాటిలో పిల్ల పురుగులను గమనిస్తే తీసి దూరంగా పారవేయాలి. 45 రోజులకు ముందుగా అజాడిరాక్టింగ్ 1500 పీపీఎం మందును 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే ఈ పురుగు గుడ్ల సంఖ్యను కొంత వరకు తగ్గించుకోవచ్చు. ముందుగానే తయోడికార్బ్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం పడుతున్న వర్షాల వల్ల రైతులు మొదటి కాత కంటే రెండో కాతపై ఎక్కువ ఆశలు పెట్టుకుంటారు. రెండో కాతకు మొదట్లోనే గులాబీ పురుగు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. కనుక దీనికి క్లోరన్ట్రా నిలిప్రోల్ మరియు లేమ్డా సైహాలోత్రిన్‌ని కలిపి ఉన్న మందు 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే ఉపయోగం ఉంటుంది.



సాగులో ఉన్న పత్తిపంట

గులాబీ పురుగు జీవన చక్రం

ఈ పురుగు 25 నుంచి 30 రోజుల్లో పూర్తవుతుందని శాస్త్రవేత్త స్నేహలత పేర్కొన్నారు. రెక్కల పురుగు లేత ఆకుల అడుగు భాగాన, ఆకుల అంచున లేదా లేత పువ్వులు, కాయలపై 250కి పైగా గుడ్ల పెడుతుంది. వీటి నుంచి పొదిగిన పిల్ల పురుగులు పువ్వుల్లోని ఖనిజాలను తినేయడం గమనించవచ్చు. అలాగే కాయలపై పొదిగిన పిల్ల పురుగులు లోపలికి చొచ్చుకుపోయి అందులో ఉన్న విత్తనాన్ని తిని విసర్జించడం వల్ల పత్తి మరియు నూనె నాణ్యత తగ్గడం, ఎదగక రాలిపోవడం జరుగుతుంది.



పత్తి కాయకు గులాబీ పురుగు(ఫైల్)



నవధాన్యాల బుట్టలతో పూజలు చేస్తున్న యువతులు

ఘనంగా 'తీజ్' ఉత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్యా తండాలో బుధవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పెద్దలు మాట్లాడుతూ బంజారాల కుల దేవత, మమాత అని, మాతకు నిర్వహించే నవరాత్రుల పండగను తీజ్ అంటామని తెలిపారు. నవరాత్రులలో భాగంగా అమ్మవారి ఎదుట నవధాన్యాలతో ఏర్పాటు చేసిన తొమ్మిది బుట్టలలో, తండాకు చెందిన పెళ్లి కాని అమ్మాయిల చేత ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నవధాన్యాల బుట్టల్లో నీళ్లు పోసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారన్నారు. నవరాత్రులు పూర్తవడంతో నవధాన్యాల బుట్టలను చెరువులో నిమజ్జనం చేసి, బంజారాల సంప్రదాయ ఆట, పాటలతో వేడుకగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడావత్ రేక్యా, మెగావత్ దుర్గ్యానాయక్, తుల్జ్యా, పర్శ్యా, కున్యానాయక్, మహిళలు, చిన్నారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి



చింతల గణేశ్

కొడిపల్లి(నర్సాపూర్): చదువుకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మురళి వివరాల ప్రకారం... మండలంలోని కూకుట్లపల్లి గ్రామానికి చెందిన చింతల గణేశ్(18) చదువు ఆపేసి ఇంటివద్ద పొలం పనులు చేస్తున్నాడు. కాగా తల్లి చదువుకోవాలని పలుమార్లు మందలించింది. దీంతో మనస్తాపం చెందిన అతడు గత నెల 9న ఇంట్లో గడ్డి మందు తాగి, విషయం ఎవరికి చెప్పలేదు. నోరు పొక్కినట్లు ఉండటంతో గమనించిన తల్లి సుశీల, బంధువు అనీల్‌కుమార్ బాధితున్ని మెదక్‌లో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వారం రోజులపాటు చికిత్స చేయించారు. తల్లి గట్టిగా అడగటంతో గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం గత నెల16న హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన..

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శాలిపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన బుస్స రమేశ్(45) సోమవారం చిన్నశంకరంపేటకు వచ్చి తిరిగి వెళుతుండగా అంబాజీపేట వద్ద మెదక్ వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాలు నుజ్జు నుజ్జు కావడంతో పాటు తలకు తీవ్రంగా గాయమైంది. మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక వైద్యం అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు.



బుస్స రమేశ్

గుండె పోటుతో వాచ్‌మెన్..

పాపన్నపేట(మెదక్): గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మంగళవారం రాత్రి ఏడుపాయల్లో విధులు నిర్వహించిన బైండ్ల నర్సింహులు(45) బుధవారం ఉదయం గ్రామానికి వెళ్లగానే ఇంట్లో గుండెపోటుకు గురై అక్కడికక్కడే మరణించాడు. కాగా అతడి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఏడుపాయల ఉద్యోగులు అంత్యక్రియల కోసం రూ.30 వేల ఆర్థిక సహాయం చేశారు.



నర్సింహులు

18 శాతం రిజర్వేషన్లు సాధించాం

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక సంస్థల్లో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ సాధనకు కృషి చేసిన ఘనత రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకే దక్కుతుందని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకుని రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు అందించారని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేసి కాంగ్రెస్ ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బరాజం, జెన్నారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను సన్మానిస్తున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మద్యం మత్తులో ఘర్షణ..

ఒకరు మృతి



మృతి చెందిన నాగారపు లక్ష్మణ్

అల్లాదుర్గం(మెదక్): మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ చెలరేగి ఒకరు మృతి చెందారు. గ్రామస్తులు, అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం... పుల్కల్ మండలంలోని పోచారం గ్రామానికి చెందిన నాగారపు లక్ష్మణ్ (38) 11 సంవత్సరాల క్రితం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరిని వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. అయితే మద్యానికి బానిసైన అతడు కొంత కాలంగా భార్యతో దూరంగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా మంగళవారం లక్ష్మణ్ గ్రామానికి వచ్చి ఇదే గ్రామానికి చెందిన పుట్టి అంజయ్యతో కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులో మాటామాట పెరిగి ఇద్దరి మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో లక్ష్మణ్‌పై అంజయ్య విచక్షణ రహితంగా దాడిచేసి గాయపర్చాడు. వెంటనే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రెండు లారీలు ఢీ..

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధ రాత్రి జరిగింది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ నుంచి మేడ్చల్‌కు వెళుతున్న లారీ తూప్రాన్ పట్టణ సమీపంలోని బైపాస్‌లో లారీ ఆగిపోయింది. ఈ క్రమంలో ముందు చక్రానికి లారీ డ్రైవర్ మహ్మద్ నసీం(40) మరమ్మతులు చేస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. అతడిపై లారీ చక్రం పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ హిమాంపల్, క్లీనర్ నిర్భయ్‌యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డీజిల్ లేక.. ఆగిన చెత్త ట్రాక్టర్

చిలప్‌చెడ్(నర్సాపూర్)): గ్రామంలో ప్రతి నిత్యం చెత్త సేకరించాల్సిన ట్రాక్టర్, సరిపడా డీజిల్ లేక వీధి మధ్యలో నిలిపివేసారు. ఈ ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో బుధవారం జరిగింది. కొంత కాలంగా సరైన నిధులు లేక చండూర్ గ్రామంలో చెత్త సేకరించాల్సిన ట్రాక్టర్ మూలన పడింది. ఈ మధ్యనే చెత్త సేకరిస్తున్న ట్రాక్టర్ డీజిల్ లేకపోవడంతో గ్రామంలోని ఓ వీధి మధ్యలోనే నిలిపేశారు. దీంతో ఆగిపోయిన ట్రాక్టర్ పరిస్థిని చూసి గ్రామస్తులు నివ్వెరపోయారు. అనంతరం గ్రామ కార్మికుడు డీజిల్ తీసుకువచ్చి చెత్త ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు.



డీజిల్ లేక వీధి మధ్యలో నిలిపివేసిన చెత్త ట్రాక్టర్

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా నిఘా బృందాలు పగడ్బందీగా విధులు నిర్వహించాలని కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సెప్టెంబర్ 29 నుంచి కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని, స్వేచ్ఛగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిబంధన లమేరకు అవకాశాలు కల్పిస్తామమన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ తీసుకు వెళ్తే వాటికి సరైన పత్రాలు చూపించకపోతే సీజ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, జెడ్పీ సీఈవో రమేశ్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కె.హైమావతి

మహాత్మా.. మన్నించు

- గజ్వేల్‌లో శిథిలావస్థలో విగ్రహం
- పట్టించుకోని పాలకులు, నాయకులు

గజ్వేల్‌రూరల్: దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో కీలకపాత్రను పోషించిన జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని అక్టోబర్ 2న జరుపుకోవడం అందరికి తెలిసిందే. ఆ రోజున ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు కలిసి మహాత్మాగాంధీ విగ్రహాలు ఎక్కడున్నా వాటిని అందంగా ముస్తాబు చేసి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. గజ్వేల్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని అందరూ మరిచిపోయారు. పగిలిన కళ్లజోడు, విరిగిన చెయ్యి, కర్ర, వెలిసిపోయిన రంగుతో దర్శనమిస్తుంది. నూతన మున్సిపల్ భవనం నిర్మించిన తర్వాత పాత కార్యాలయం వద్ద ఉన్న విగ్రహాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం, నూతన మున్సిపల్ కార్యాలయం, కోర్టు సమీపంలో ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహాలను ముస్తాబు చేశారు. ఈ విధంగానే పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహాన్ని తీర్చిదిద్దాలని, లేనిపక్షంలో అక్కడి నుంచి విగ్రహాన్ని తొలగించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.



పాత మున్సిపల్ కార్యాలయం ముందు శిథిలావస్థలో ఉన్న మహాత్ముని విగ్రహం

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుదాం



పద సంచాలన్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



ఉత్సవాల్లో మాట్లాడుతున్న సోమయాజులు

న్యాల్‌కల్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచారక్, వనవాసి కల్యాణ పరిషత్తు సోమయాజులు అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం న్యాల్‌కల్‌లో పద సంచాలన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, అభిమానులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం స్థానిక కృష్ణ కన్వెన్షన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమయాజులు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ 1925లో విజయ దశమినాడు ఆవిర్భవించిందన్నారు. విపత్తు సమయాల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తమ సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముంగి ఆది లక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్, రాంచందర్ పవార్‌తో పాటు ఇతర ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.